## క్లుప్తంగా

### రేపటి నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

**వనపర్తి టౌన్:** జిల్లాలో ఈ నెల 3 నుంచి 11వ తేదీ వరకు 10వ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతాయని జిల్లా అసిస్టెంట్ ఎగ్జామినేషన్ కమిషనర్ గణేష్ తెలిపారు. శనివారం పరీక్షలకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. జిల్లాలో మొత్తం 964 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని.. జిల్లాకేంద్రంలోని అనూస్, చాణక్య పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష కొనసాగుతుందని.. పరీక్షల నిర్వహణకు ఇద్దరు సీఎస్‌లు, డీఓలు, 25 మంది ఇన్విజిలేటర్లు, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ టీం, ఒక సిట్టింగ్ స్క్వాడ్ టీం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

### కోదండరామస్వామి ఆలయ హుండీ లెక్కింపు

**గోపాల్‌పేట:** మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఆలయ హుండీని శనివారం ఈఓ రామేశ్వర శర్మ, జూనియర్ అసిస్టెంట్ నగేష్, గ్రామస్తుల సమక్షంలో లెక్కించారు. 2021 సంవత్సరం నుంచి శనివారం వరకు రూ.25,800 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. లెక్కింపులో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, కొంకి రమేష్, ధన్వాడ నాగరాజు, కృష్ణయ్య, గోపాల్, పార్థసారథి, కోదండం, శివయ్య పాల్గొన్నారు.

### అంగన్‌వాడీలో సీమంతం

**పెబ్బేరు రూరల్:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–3లో వీహెచ్ఎస్ఎన్‌డీ ప్రోగ్రాంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో కొత్తగా నమోదైన మనీష, అస్మాబేగం ఇద్దరు గర్భిణులకు సీమంతాలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రం సేవలను గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు సద్వినియోగం చేసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ మంజులరాణి అన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఆరేళ్లలోపు చిన్నారుల వరకు బరువులు తీసి పిల్లల స్థితిని పరిశీలించి తల్లిదండ్రులకు సూచనలు ఇస్తారని తెలిపారు. ఏడు నెలల చిన్నారుల నుంచి మూడేళ్ల చిన్నారులకు బాలామృతం, గుడ్లు అందజేస్తున్నామన్నారు.

### విత్తనాల వివరాలు వెల్లడించాలి

**పెబ్బేరు రూరల్:** జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ఎరువులు, విత్తనాల వివరాలను అధికారులు వెల్లడించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జె.చంద్రయ్య విజ్ఞప్తి చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో ఎరువులు, విత్తనాల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ నేపథ్యంలో ఆ ప్రభావం జిల్లా రైతులపై ఉంటుందన్నారు. వరి, వేరుశనగ, మొక్కజొన్న, ఆముదం, పత్తి, కంది తదితర పంటల సాగు చేసేందుకు రైతులు పొలాలను సిద్ధం చేసుకున్నారని, రోహిణి కార్తి రావడంతో బోర్ల కింద వరి నార్లు పోసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారన్నారు. జిల్లాలో రైతులు ఏఏ పంటలు ఎన్ని ఎకరాలు సాగు చేస్తున్నారు, ఎంత విత్తనం అవసరం, ప్రస్తుతం విత్తనాల నిల్వల గురించి వివరాలను ఉన్నతాధికారులు వెల్లడించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, శాంతన్న ఉన్నారు.

### షేక్షావలి దర్గా గంధం

**ఖిల్లాఘనపురం:** మండల కేంద్రంలో శనివారం షేక్‌షావలీ దర్గా గంధం ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గంధం ఊరేగింపు కార్యక్రమానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌తో పాటు పలువు కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. కులమతాలకు అతీతంగా నిర్వహించిన గంధం మహోత్సవ కార్యక్రమంలో మండల కేంద్రంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామానికి దక్షిణ వైపున ఉన్న గుట్టపైన ఉన్న దర్గా గంధం, ఉర్సు కార్యక్రమాన్ని ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తామని ఇంతియాజ్ తెలిపారు. కార్యక్రమంలో నరేందర్‌గౌడ్, గౌస్, అజీమ్, ఇంతియాజ్, షయాజ్, ఇర్షాద్, రహీం, ఖాదర్, నసీరుద్దీన్, గణి, ముజాహిద్, ఖదీర్ పాల్గొన్నారు.

### గృహ హింస: కేసు నమోదు

**అమరచింత:** భర్తతో పాటు అత్త నిత్యం వేధిస్తున్నారని వివాహిత మహిళ ధరణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గృహహింస కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన ధరణికి మూడేళ్ల క్రితం ఇదే గ్రామానికి చెందిన రవికుమార్‌తో ప్రేమ పెళ్లి జరిగింది. ప్రస్తుతం తను అందంగా లేనని, ఇంటికి వస్తే తన అమ్మ, అన్న బయటకు నెట్టేస్తారని భర్త చెప్పడంతో మనస్థాపంతో పోలీసుకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ధరణి ఇచ్చిన ఫిర్యాదుతో ముగ్గురిపై గృహహింస కేసు నమోదు చేశామన్నారు.

### దశాబ్ది వేడుకలకు కార్యాలయాలు ముస్తాబు

**వీపనగండ్ల:** రాష్ట్ర అవతరణ వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి 10ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాలను ఎగరవేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, యువకులు, మహిళలు పాల్గొనాలని కోరారు.



కొత్తకోటలో హనుమాజన్ విగ్రహ ఊరేగింపు చేస్తున్న యువకులు



ఆత్మకూర్‌లో పూజల్లో పాల్గొన్న చైర్‌పర్సన్ గాయత్రి

# భక్తిశ్రద్ధలతో హనుమాన్ ఊరేగింపు

**సాక్షి, నెట్‌వర్క్:** హనుమ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా భక్తులు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి హనుమాన్, వైష్ణవ, శైవ ఆలయాల్లోని హనుమంతుడిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకొని తన్మయత్వం పొందారు. ఇదే క్రమంలో 40 రోజుల క్రితం అంజన్న మాలాధారణ చేసిన భక్తులు మండల దీక్ష పూర్తికావడంతో శనివారం ఇరుముడిధారణ చేపట్టారు. ఆత్మకూర్‌లో నిర్వహించిన ప్రత్యేక పూజ, శోభాయాత్రలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, చైర్‌పర్సన్ గాయత్రిరవికుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాను విగ్రహాలతో భక్తులు ఊరేగింపు చేశారు. పూజల్లో అర్చకులు రామాచారి, రామకృష్ణశర్మ శ్రీవారి సేవకుడు సితార వెంకటేశ్వర్లు, మాధవుడు,వెంకటేష్ పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో శోభయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ప్రజాప్రతినిధులు



చీకురుచెట్టుతండాలో..



అమరచింతలో..



సూగూరులో..



వనపర్తిలో ఇరుముడితో మాలధారులు



మూలమళ్లలో..

## రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి




ఆర్ఐకి వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

**అమరచింత:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా రాజన్న మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు వ్యవసాయ పనులు చేసుకోవాలంటే ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు పర్చాల్సిన అవసరం ఉందన్నారు. 2024 సంవత్సరంలోనే స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సన్నాలకు కాకుండా వరి పండించిన రైతులందరికీ రూ.500 వందల బోనస్ ఇవ్వాలన్నారు. ఫర్టిలైజర్స్ షాపులలో ఈపాస్ యాంత్రాల ద్వారానే విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నకిలీ విత్తనాలను అమ్ముతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి రైతులను కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్ఐ వెంకటేష్‌కు అందించారు. వెంకటయ్య, చింతలన్న, బాలస్వామి, కురుమన్న, మహమూద్, భక్తరాజ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## 'బడిబాట'ను విజయవంతం చేద్దాం



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్



అమరచింతలో..

**అమరచింత:** ఈనెల 3 నుంచి 19 వరకు కొనసాగుతున్న బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ కోరారు. బడిబాట కార్యక్రమ నిర్వహణపై శనివారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బడిబాట కార్యక్రమానికి సంబంధించి రోజువారి చేయాల్సిన కార్యక్రమాల గురించి ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు వివరించారు. బడిబయటి పిల్లలను గుర్తించడమే కాకుండా ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన ఉంటుందన్న విషయాలను విద్యార్థుల తల్లితండ్రులకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు బలరాముడు, ఎంపీఓ నరసింహులు పాల్గొన్నారు.

**పాన్‌గల్:** ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు కోసం నిర్వహించే బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, ఎంపీడీఓ కోటేశ్వర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ కమిటీల చైర్‌పర్సన్లకు మండల స్థాయి బడిబాట సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 3వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే బడి బాట కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవుతూ విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో డీటీ అశోక్‌నాయుడు, ఐకేపీ ఏపీఎం సక్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య..**

**ఆత్మకూర్:** ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను పాఠశాల్లో చేర్పించాలని తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ సుజాత, కమిషనర్ నాగరాజు, ఎంఈఓ భాస్కర్‌సింగ్, ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆయాశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంలు విష్ణువర్ధన్‌రెడ్డి, బాల్‌రాజు, మద్దిలేటి, బాల్‌రాం, హెచ్ఎంలు, కార్యదర్శులు, అంగన్‌వాడీలు, మహిళాసమాఖ్య సభ్యులు, ఉపాధి హామీ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

**కొత్తకోట రూరల్:** ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారి షేక్ మున్నా అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం స్థానిక పోలీసులతో కలిసి ఏఓ మున్నా పట్టణంలోని ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు చేయడంతో పాటు స్టాక్ నిల్వ వివరాలు, రికార్డు నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ షాపుల్లోనే కొనుగోలు చేయాలన్నారు. ఏ డీలరైనా విత్తనాలను ఎమ్మార్పీ ధర కంటే అధిక ధరలకు విక్రయిస్తే, కృత్రిమ కొరత సృష్టించిన డీలర్లపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ఫర్టిలైజర్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు..**

**గోపాల్‌పేట:** మండలంలోని గోపాల్‌పేట, ఏదుల గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపుల్లో శనివారం వ్యవసాయశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కృత్రిమ విత్తనాల కొరత సృష్టించొద్దని, లేబుల్, పాకింగ్ లేని విత్తనాలు అమ్మొద్దని ఫర్టిలైజర్ షాపు యజమానులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాములు, ఆర్ఐ యాదయ్య ఉన్నారు.



ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఏఓ

### ఎల్‌ఓసీ అందజేత



**గోపాల్‌పేట:** ఆపదలో ఉన్నవారికి ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎల్లగౌడ్ అన్నారు. మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన వేముల గీత అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చేరింది. విషయాన్ని స్థానిక నాయకులు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఆయన ఆరోగ్య ఖర్చుల కోసం రూ. 2.50 లక్షలు ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. ఎల్‌ఓసీ పత్రాన్ని శనివారం చిన్నారెడ్డి వేముల గీత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో ప్రవీన్‌కుమార్, రాచాల ధర్మారెడ్డి పాల్గొన్నారు.

### అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న బైక్

**కొత్తకోట రూరల్:** బైక్‌పై అతివేగంతో వెళ్తూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణ కేంద్రానికి చెందిన బాలరాజు మెకానిక్‌గా పనిచేస్తుండేవాడు. బాలరాజు తన బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఎస్‌బీఐ సమీపంలో ముందు వెళ్తున్న బైక్‌ను ఓవర్‌టెక్ చేయబోయి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో 108లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

### బొలెరో వాహనం బోల్తా



**కొత్తకోట రూరల్:** ముందువెళ్తున్న లారీని ఓవర్‌టెక్ చేయబోయి బొలెరో అదుపుతప్పి రోడ్డు దిగి బోల్తా పడిన ఘటన మండలంలోని అమడబాకుల స్టేజీ సమీపంలో ఎన్‌హెచ్44పై శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. లారీ డ్రైవర్ సైడ్ ఇచ్చినట్లే ఇచ్చి మళ్లీ యథాస్థానంలోకి వెళ్లడంతో వెనుక వస్తున్న బొలోరో వాహనం లారీని ఢీకొట్టకుండా డ్రైవర్ చాకచక్యంగా కంట్రోల్ చేయడంతో అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. బొలోరో వాహనం డ్రైవర్ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం చిత్తూర్ జిల్లా కుప్పం నుంచి బొలోరో వాహనంలో మామిడిపండ్ల లోడ్ చేసుకుని హైదరాబాద్‌కు శుక్రవారం మధ్యాహ్నం బయలు దేరారు. శనివారం తెల్లవారుజామున అమడబాకుల సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో దాన్ని తప్పించబోయి బొలెరో అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో మామిడి పండ్ల బస్తాలు చెల్లాచెదురుగా పడ్డాయి. డ్రైవర్ బాలరాజుకు ఎలాంటి ప్రమాదం జరుగలేదు. బొలోరో వాహనంలో సూమారు రూ.2లక్షల విలువ చేసే 4టన్నుల మామిడి పండ్లు ఉన్నట్లు డ్రైవర్ తెలిపారు.

## ఉపాధి పనుల పరిశీలన

**పాన్‌గల్:** మండలంలోని అన్నారం శివారులోని చెరువులో ఉపాధి హామీ పథకం ద్వారా ఒండ్రు మట్టి తరలింపు పనులను శనివారం ఏపీఓ కుర్మయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు కొలతల ప్రకారం పనులు చేస్తే కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. ఒండ్రు మట్టి తరలింపు పనులను రైతులు సద్వినియోగం చేసుకునే విధంగా సిబ్బంది వారికి అవగాహన కల్పించాలన్నారు. ఒండ్రు మట్టి తరలింపుతో చెరువులో వర్షపు నీటి నిల్వ సామర్థ్యం పెరగడం, ఒండ్రు మట్టితో పొలాలకు సారం పెరుగుతుందన్నారు. పనుల వద్ద కూలీలకు ఇబ్బందులు కలుగకుండా నిబంధనల మేరకు వసతులు కల్పించాలని ఆదేశించారు. అనంతరం నర్సరీని పరిశీలించి పెంచుతున్న మొక్కలపై ఆరా తీశారు.



ఒండ్రు మట్టి తరలింపు పనులను పరిశీలిస్తున్న ఏపీఓ కుర్మయ్య

## రిటైర్డ్ ఉపాధ్యాయులకు సన్మానం

**వనపర్తి టౌన్:** ఉపాధ్యాయ వృత్తి అన్ని వృత్తుల కంటే గొప్పదని, విద్యార్థులకు దిశానిర్దేశం చేసి వారి బంగారు భవిష్యత్‌కు బాట వేసేది ఉపాధ్యాయులేనని పీఆర్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బౌద్ధ్రా అన్నారు. శనివారం పీఆర్టీయూటీఎస్ కార్యాలయంలో ఇటీవల రిటైర్ అయిన ఉపాధ్యాయులు పి. సురేంద్రనాథ్, రాంప్రసాద్, విశాలాక్ష్మిని జిల్లా అధ్యక్షుడు వరప్రసాద్‌రావు అధ్యక్షతన పూలమాలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ పొందిన ముగ్గురు ఉపాధ్యాయులు సంఘానికి ఎనలేని కృషి చేశారని చెప్పారు. జిల్లా గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పీఆర్టీయూటీఎస్ సంఘం ఉపాధ్యాయుల కోసమే పుట్టిందని, ఉపాధ్యాయుల సంక్షేమమే సంఘం లక్ష్యం అని చెప్పారు. పి.సురేంద్రనాథ్ అల్వాల ప్రాథమికోన్నత పాఠశాలలో గణితం, రాంప్రసాద్ రంగాపురంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో గణితం ఉపాధ్యాయుడిగా, విశాలాక్ష్మి జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీనివాసులు గౌడ్, జయరాములు, జయశంకర్, గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి, మంజులత తదితరులు పాల్గొన్నారు.



రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

## చర్యలు తీసుకోవాలని వినతి

**పాన్‌గల్:** మండలంలోని చిక్కేపల్లిలో ప్లాట్ల హద్దులను తొలగించిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ సర్పంచ్ బాలస్వామి ఆధ్వర్యంలో లబ్ధిదారులు శనివారం తహసీల్దార్, ఎస్ఐకి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెం.361లోని 2ఎకరాల 30గుంటల విస్తీర్ణంలో ప్లాట్ల హద్దులు ఏర్పాటు చేసి రెవెన్యూ అధికారుల సమక్షంలో లబ్ధిదారులకు ప్లాట్లను పంపిణీ చేశారు. కానీ గ్రామానికి చెందిన భాస్కర్‌యాదవ్ ప్రోత్సాహంతో ఛత్రపతి అనే వ్యక్తి జేసీబీ సాయంతో శుక్రవారం హద్దు రాళ్లను తొలగించి చదును చేశారు. అధికారికంగా పంపిణీ చేసిన ప్లాట్ల హద్దులను తొలగించి చదును చేసిన వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్, లబ్ధిదారులు

## ఆశావర్కర్లకు నష్టం కలిగించొద్దు





వినతిపత్రం అందజేస్తున్న ఆశాకార్యకర్తలు, కొత్తకోటలో..

**పాన్‌గల్:** ఆశా కార్యకర్తలకు నష్టం కలిగించే పరీక్ష విధానాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల యూనియన్ మండల నాయకులు అలివేలు, లక్ష్మి, సువర్ణ, ఆశమ్మ మాట్లాడుతూ ఇన్నాళ్లు ప్రజలకు సేవ చేసిన తమను పరీక్షలు రాయాలని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. గతంలో చాలా మంది చదువుతో సంబంధం లేకుండా చాలా మంది ఆశా కార్యకర్తలు ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఒక వైపు పనిభారంతో ఇబ్బందులు పడుతుంటే రిటైర్మెంటు అయ్యే వయస్సులో పరీక్షలు రాయాలనడంపై మండిపడ్డారు. ఆశాలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని కోరారు.

**కొత్తకోట రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లపై చిన్నచూపు చూస్తుందని, కొత్తగా అర్హత పరీక్ష తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ మండలంలోని ఆశాలు శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలంటూ డాక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఆశా యూనియన్ మండల అధ్యక్షురాలు మంజుల, పుష్ప, రేణుక, చంద్రకళ, మంజుల, ఇందిర, స్వాతి, గీత, రజిత, కాంచన ఉన్నారు.

## పార్టీకి నరసింహులుగౌడ్ సేవలు మరువలేం



కేశం నరసింహులుగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**అమరచింత:** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా, నాయకుడిగా సేవలందించిన కేశం నరసింహులుగౌడ్ సేవలను ఎన్నటికీ కాంగ్రెస్ పార్టీ మరువదని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. రాష్ట్ర టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ తండ్రి నరసింహులుగౌడ్ ప్రథమ వర్ధంతి వేడుకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఎదుగుదల కోసం కృషి చేసిన నాయకుల్లో నరసింహులుగౌడ్ ఒకరన్నారు. అనంతరం టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్‌తో పాటు ఆయన సోదరులు శ్రీలస్‌గౌడ్, అశోక్‌గౌడ్‌తో పాటు కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయుబ్‌ఖాన్, అరుణ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, పరమేష్, పోసిరిగారి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## సారా తయారీదారుల బైండోవర్

**పాన్‌గల్:** మండలంలోని తెల్లరాళ్లపల్లితండా, శాగాపూర్‌తండా, కిష్టాపూర్‌తండాల్లో అక్రమంగా సారా తయారు చేస్తున్న, నల్ల బెల్లం అమ్ముతున్న 15 మందిని శనివారం ఎక్సైజ్ పోలీసులు పట్టుకొని తహసీల్దార్ సుభాష్‌నాయుడు ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సారా రహిత మండలంగా తీర్చిదిదేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని కోరారు. మండలంలో ఎక్కడైనా సారా అమ్మిన, తయారు చేసిన, సారా తయారీకి అవసరమైన నల్లబెల్లం, నావసారగం, పటికలను అమ్మిన వారిని ఉపేక్షించేది లేదని, చట్టపరంగా శిక్షకు అర్హులవుతారన్నారు. సారా అమ్ముతూ మరోసారి పట్టుబడితే రూ. లక్ష జరిమాన లేదా జైలు శిక్ష ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ సంధ్యారాణి, సిబ్బంది రాజు, కురుమూర్తి, మన్యం, ఆంజనేయులు, రాధిక పాల్గొన్నారు.



బైండోవరైన వ్యక్తులతో ఎక్సైజ్ సీఐ

## ఆటపాటలతో విద్య నేర్పితే ఫలితం

**వీపనగండ్ల:** అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటల ద్వారా విద్య నేర్పితే మంచి ఫలితాలు వస్తాయని సీడీపీఓ లక్ష్మమ్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పూర్వప్రాథమిక విద్యలో భాగంగా పసిపిల్లలకు ఉపయోగపడే ఎన్నో రకాల ఆట వస్తువులను అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉంచినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం పౌష్టికాహారం అందిస్తున్నారని, మూఢనమ్మకాల నుంచి మహిళలను చైతన్యవంతులను చేయడంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రధాన పాత్ర పోషించాలని ఆమె అన్నారు. సెంటర్ నిర్వహణలో ఎలాంటి అలసత్వాన్ని ప్రదర్శించినా నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పాలు, గుడ్లు, పౌష్టికాహారం ఎన్నో పోషక విలువలతో కూడుకున్నదని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయ్, మహేశ్వరి, ఎల్లమ్మ, హెల్పర్లు ఈశ్వరమ్మ, లచ్చమ్మ, నిరంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.